క్లుప్తంగా

హాకీ పోటీల్లో ప్రతిభ


టీ సర్కిల్‌లో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న హాకీ క్రీడాకారులు

కళ్యాణదుర్గం: అనంతపురం ఆర్డీటీ హాకీ స్టేడియంలో ఉభయ జిల్లాల (అనంతపురం, సత్యసాయి) అండర్ -8, అండర్-10 హాకీ పోటీలు ఈనెల 20 నుంచి 21వ తేదీ వరకూ నిర్వహించారు. పోటీల్లో కళ్యాణదుర్గం (బి) హాకీ టీం మొదటి స్థానం, అనంతపురం హాకీ టీం ద్వితీయ స్థానం, కళ్యాణదుర్గం (సీ) టీం తృతీయ స్థానం సాధించాయి. ఈ సందర్భంగా కళ్యాణదుర్గంలో ఆదివారం విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. కళ్యాణదుర్గం హాకీ జట్లను ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి, జిల్లా కార్యదర్శి అనిల్ కుమార్, సత్యసాయి జిల్లా కార్యదర్శి సూర్య ప్రకాష్, ఆర్డీటీ కో ఆర్డినేటర్ ఓబిలేశు, కోచ్‌లు చౌడేశ్వర్, శంకర్ అభినందించారు. కార్యక్రమంలో హాకీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఎంఎస్ అక్రమ్ బాషా, క్రీడాకారులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ పరిధిలోని కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి వైద్యులు, అనంతపురం అంధత్వ నివారణ సంస్థ అధికారులు సుమారు 160 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 51 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించి బెంగళూరుకు తరలించారు. ఆర్య వైశ్య అధ్యక్షుడు సంఘం అధ్యక్షుడు జయం విశ్వనాథ్, కంటి వైద్య నిపుణులు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

చురుగ్గా గాలి గోపురాల నిర్మాణం


గోపుర నిర్మాణం జరుగుతున్న దృశ్యం

కూడేరు: బళ్లారికి చెందిన బసన్న గౌడ్ అనే భక్తుడు కూడేరులో ప్రఖ్యాతిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద ఉత్తరం-దక్షిణం వైపు సుమారు రూ.90లక్షలతో గాలి గోపురాల నిర్మాణం చేపట్టేందుకు ముందుకు వచ్చాడు. నిర్మాణపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. గోపురాల నిర్మాణంలో భక్తులు, గ్రామస్తులు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.

శుభకార్యం

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యం గ్రామంలో ఆదివారం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు డి.అల్లీపీరా కుమార్తె నూర్‌యిచెష్మి-లతీఫ్‌బాషా వివాహానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు కంప్యూటర్ల వితరణ


కంప్యూటర్లు అందజేస్తున్న విశ్రాంత కస్టమ్స్ అధికారి

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.లక్ష విలువ చేసే ఐదు కంప్యూటర్లను ఆదివారం ప్రిన్సిపాల్ రామకృష్ణకు పట్టణానికి చెందిన విశ్రాంత కస్టమ్స్ అధికారి పచ్చి వెంకటస్వామి అందించారు. దాత మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో పర్యటించినపుడు ల్యాబ్‌లో కంప్యూటర్ల కొరత ఉందని అధ్యాపకులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. పేద విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యత అందాలన్న లక్ష్యంతో కంప్యూటర్లు అందజేశానన్నారు. దాతను ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

ఇప్పేరు చెరువులోకి కృష్ణా జలాలు


జలకళ సంతరించుకున్న ఇప్పేరు చెరువు

కూడేరు: మండలంలోని ఇప్పేరు చెరువులోకి 20 రోజులుగా కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. దీంతో చెరువుకు జలకళ వచ్చింది. మండలంలోని పి.నారాయణపురం వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ వెళ్లింది. కాలువ నుంచి పిల్ల కాలువ ద్వారా ముద్దలాపురం చెరువుకు గత నెలలో నీటిని అధికారులు విడుదల చేశారు. ఆ చెరువులో నుంచి వంక ద్వారా ఇప్పేరు చెరువులోకి నీరు సరఫరా అవుతోంది. ఈ చెరువులో నీరు నిల్వ ఉంటే అంతరగంగ, పి.నాగిరెడ్డిపల్లి, కూడేరు, గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామాల్లో భూగర్భ జలాలు పెంపొందుతాయి. చెరువులోకి నీరు వస్తుండడంతో ఆయా గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలే నిర్ణేతలు!

- అసెంబ్లీ ఎన్నికల్లో కీలకంగా మారనున్న అతివలు
- తాజా ముసాయిదాలో 7,05,592 మంది ఓటర్లు



రాయదుర్గం: అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓట్లు కీలకం కానున్నాయి. గత ఎన్నికల కంటే ఈసారి మహిళా ఓటర్ల సంఖ్య పెరిగింది. వారు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారో ఆ పార్టీ నాయకులకు విజయవకాశాలు ఎక్కువగా ఉంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లు 7,05,592 మంది. వీరిలో పురుషులు 3,52,545 మంది. మహిళలు 3,52,986 మంది, ఇతరులు 61 మంది ఉన్నారు. గత ఎన్నికలతో పోల్చితే 30 వేల మందికి పైగా కొత్త ఓటర్లు నమోదయ్యారు. రాయదుర్గం, ఉరవకొండలో 1072 ఓట్లు మహిళలే అధికంగా ఉన్నారు. కళ్యాణదుర్గం లో మాత్రమే 586 ఓట్లు పురుషులే అధికంగా ఉన్నట్టు తాజాగా విడుదలైన ఓటరు ముసాయిదా ప్రకారం వెల్లడైంది. కాగా ఈ ఏడాది ఓటరు జాబితాలో పేరు నమోదు కోసం యువత ఆసక్తి కనబరిచింది. బీఎల్‌ఓలు ఇంటింటా తిరిగి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దీనివల్ల ఓటర్ల సంఖ్య పెరిగింది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సుమారు 20 వేల మందికి పైగా దరఖాస్తులు అందజేయగా.. అందరికీ ఓటు హక్కు కల్పించారు.

మార్పులు, చేర్పులకు అవకాశం

ఓటరు నమోదుకు అధికారులు డిసెంబర్ 9 వరకు అవకాశం కల్పించారు. చేర్పులు, మార్పులకు దరఖాస్తు చేసుకోవడంతో పాటు అభ్యంతరాలను సమర్పించుకునే అవకాశం కల్పించారు. క్లెయిమ్‌లను డిసెంబర్ 29 లోగా పరిష్కరించి 2024 జనవరి 5న తుది జాబితా అధికారికంగా విడుదల చేస్తారు.

ఓటర్ల వివరాలు ఇలా..

- రాయదుర్గం నియోజకవర్గంలోని 296 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,58,826 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,29,342, మహిళలు 1,29,466, ఇతరులు 28 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 114 మంది ఎక్కువగా ఉన్నారు.
- ఉరవకొండ నియోజకవర్గంలో 259 పోలింగ్ కేంద్రాలు ఉండగా, పురుషులు 1,08,848, మహిళలు 1,09,761, ఇతరులు 28 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 913 మంది అధికంగా ఉన్నారు.
- కళ్యాణదుర్గంలో 261 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో పురుషులు 1,14,356, మహిళలు 1,13,769, ఇతరులు 05 మంది ఉన్నారు. వీరిలో మహిళలకంటే పురుషులు 586 మంది ఎక్కువగా ఉన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు



అర్హత కలిగిన వారంతా డిసెంబర్ 9 వరకూ కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలి. బీఎల్‌ఓలకు దరఖాస్తు అందిస్తే విచారించి ఓటరుగా నమోదు చేస్తాం. తాజాగా విడుదలైన ముసాయిదాలోనూ చేర్పులు, మార్పులు ఏవైనా ఉంటే సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇది డ్రాఫ్ట్ ఓటరు జాబితా మాత్రమే.. వచ్చే ఏడాది జనవరి 5న ఫైనల్ పబ్లికేషన్ ఉంటుంది.

– రాణి సుష్మిత, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయిపోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం వేణుగోపాల్, పీడీలు సత్యనారాయణ , కళా సుధాకర్ అభినందించారు. వారు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో నవంబర్ 4న జరుగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు జిల్లా తరపున పాఠశాలకు చెందిన వి.సూరి (8వ తరగతి)ఎంపికయ్యారన్నారు. అలాగే తిరుపతి పట్టణంలో నవంబర్ 8 నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు జిల్లా తరపున రామ్‌చరణ్(8వ తరగతి), జయంత్ (10వతరగతి) ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఏఐబీఎస్ఎస్ మండల కమిటీ ఎన్నిక


నూతన సభ్యులు వీరే..

వజ్రకరూరు: మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం(ఏఐబీఎస్ఎస్) మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎస్.ఈశ్వర్‌నాయక్, జనరల్ సెక్రటరీగా వెంకటేష్ నాయక్, ట్రెజరర్‌గా అంజి నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దుర్గానాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా దాక్యానాయక్, యూత్ వింగ్ జనరల్ సెక్రటరీగా దీపానాయక్, వైస్‌ప్రెసిడెంట్‌గా రామక్రిష్ణనాయక్ ఎన్నికయ్యారు. వారిని సంఘం జిల్లా అధ్యక్షుడు బాలాజీనాయక్, గౌరవాధ్యక్షుడు నాగరాజునాయక్ అభినందించారు. మండల కమిటీ సభ్యులు మాట్లాడుతూ బంజారాల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బంజారా నాయకుడు సుంక్యానాయక్, బంజారా పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కృషి

బొమ్మనహాళ్: రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి అందరూ కృషి చేయాలని బొమ్మనహాళ్ ఎస్‌ఐ శివ సూచించారు. ఆదివారం ఉద్దేహాళ్ గ్రామ శివారులోని వేదావతి హగరినది వద్ద ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే ప్రమాదకరమైన మలుపులు ఉన్న చోట సూచనలు పాటించాలన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్, వాహన రికార్డులు కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా 32 మందికి జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఉరవకొండ: మండల పరిధిలోని మోపిడి గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఆదివారం ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. కళ్యాణదుర్గానికి చెందిన హనుమంతు ద్విచక్ర వాహనంలో ఉరవకొండకు వస్తుండగా మోపిడి గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పడంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు వెంటనే 108 వాహనంలో అతడిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు అత్యవసర చికిత్స నిమిత్తం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైలును చిక్కమంగళూరు వరకూ పొడిగించాలి



రాయదుర్గంటౌన్: రాయదుర్గం మీదుగా నడిచే గుంతకల్లు-చిక్‌జాజూర్ పాస్ట్ ప్యాసింజర్ రైలును (07585/07586) చిక్కమంగళూరు వరకూ పొడిగించాలని ఆంధ్ర, కర్ణాటక ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం గుంతకల్లు-చిక్‌జాజూర్ ప్యాసింజర్ రైలు బళ్లారి, రాయదుర్గం, మొలకాల్మూరు, చెళ్లకెర, చిత్రదుర్గం మీదుగా చిక్‌జాజూర్ వరకూ రాకపోకలు సాగిస్తోంది. ఈ రైలును చిక్‌జాజూర్ నుంచి కేవలం 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రముఖ పర్యాటక, ఎన్నో ఆకర్షణీయ స్థలాలతోపాటు ప్రముఖ ఆధ్యాత్మిక స్థలమైన దాదాపహడ్ (బాబాబుడెన్‌గిరి గిల్స్)కు వెళ్లేందుకు చిక్కమంగళూరు వరకూ పొడిగించాలని కోరుతున్నారు. దాదాపహడ్‌కు రోజూ ప్రయాణికులు వెళ్తుంటారన్నారు. బెంగళూరు రైలుకు వెళ్లి కడూరులో దిగి చిక్‌మంగళూరు వెళ్లాల్సి ఉంటోందన్నారు. గుంతకల్లు, చిక్‌జాజూర్ రైలును కడూరు మీదుగా చిక్‌మంగళూరుకు నడిపితే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. గుంతకల్లు నుంచి చిక్‌జాజూర్ వరకూ దాదాపహడ్‌కు ప్రయాణించే వారికి ఎంతో సౌలభ్యమన్నారు. ప్రయాణికుల డిమాండ్‌ను పరిగణలోకి తీసుకుని రైల్వే ఉన్నతాధికారులు ఆ దిశగా చిక్‌జాజూర్ రైలును చిక్కమంగళూరు వరకూ పొడగించాలని సర్వత్రా డిమాండ్ చేస్తున్నారు.

లబ్ధిదారులకు ఇంటి స్థలాలు చూపుతాం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: కోర్టు వివాదంలో ఉంటూ క్లియరెన్స్ అయిన 560 మంది లబ్ధిదారులకు దశల వారీగా ఇంటి స్థలాలను రెవెన్యూ అధికారులు చూపుతారని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైస్ ఎంపీపీ నరసింహులు, ఉపసర్పంచ్ వన్నప్ప, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి లబ్ధిదారులకు ఇచ్చిన మాట ప్రకారం 589-5 సర్వే నెంబర్‌లో జంగిల్ క్లియరెన్స్ పనులు వేగవంతంగా పూర్తి చేశామన్నారు. అలాగే సరిహద్దు రాళ్లు పాతించి లబ్ధిదారులకు ఇంటి స్థలాలు చూపడానికి రెవెన్యూ అధికారులు చురుగ్గా పనులు చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో హామీ పత్రాలు పొందిన 10.11,12, 13, 14వ వార్డు లబ్ధిదారులు కొలిమి వద్ద ఉన్న జగనన్న లేఅవుట్ వద్దకు సోమవారం రావాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు ఈడిగ ప్రసాద్, పచ్చి రవి, జేసీఎస్ కన్వీనర్ ఆసీఫ్, నాయకులు జిలాన్, వన్నూర్‌సాబ్, అయ్యర్‌దాదు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు


కూడేరులో వాల్మీకి చిత్ర పటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం


బోరంపల్లిలో వాల్మీకి విగ్రహం ఊరేగిస్తున్న గ్రామస్తులు

కూడేరు: రామాయణ సృష్టికర్త, ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో వాల్మీకి కులస్తులు ఘనంగా నిర్వహించారు.తొలుత విఘ్నేశ్వర కాలనీలో ఉన్న వాల్మీకి ఆలయంలో వాల్మీకి మహర్షికి పురోహితుడు శివశంకర్ శాస్త్రి క్షీరాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ మానవాళికి వాల్మీకి జీవితం ఆదర్శప్రాయమన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుదామన్నారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం వాల్మీకి చిత్రపటాన్ని మంగళ వాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో వాల్మీకి కులస్తులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బోరంపల్లిలో..

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బోరంపల్లిలో ఆదివారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహాన్ని ఊరేగించారు. మహిళలు హారతులు పట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో కార్డెన్ సెర్చ్


శివరామిరెడ్డి కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు


ఎన్.హనుమాపురంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ యుగంధర్

ఉరవకొండ: స్థానిక శివరామిరెడ్డి కాలనీలో ఉరవకొండ అర్బన్ సీఐ తిమ్మయ్య, ఎస్‌ఐ వెంకటస్వామి ఆధ్వర్యంలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా లైసెన్స్ లేని వాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డులు లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

గొడవలొద్దు... ప్రశాంత జీవితమే ముద్దు

కణేకల్లు: పంతాలు, పట్టింపులతో గొడవలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్ సూచించారు. మండలంలోని ఎన్.హనుమాపురం గ్రామంలో ఆదివారం ఉదయం 6:30 గంటలకు పట్టణ సీఐ లక్ష్మన్న, కణేకల్లు ఎస్‌ఐ దుగ్గిరెడ్డి, బొమ్మనహాళ్ ఎస్‌ఐ శివ, డి.హిరేహాళ్ ఎస్‌ఐ రంగడు, రాయదుర్గం టౌన్ ఎస్‌ఐ ప్రసాద్‌తో కలిసి ఆయన పలువురి ఇళ్లు, దొడ్లలో కార్డెన్ సర్చ్ (నాకా బందీ) చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాయదుర్గం రూరల్ సీఐ మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా నడుచుకొంటే ఉపేక్షించేది లేదన్నారు. బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రాచన్న గౌడ్ సేవలు మరువలేనివి


రాచన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: జేసీఎస్ మండల కన్వీనర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పాటిల్ రాచన్నగౌడ్ పార్టీకి, ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని గూళ్యపాళ్యం గ్రామానికి ఆయన ఈ నెల 17న మృతిచెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆదివారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సంతాపసభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పాటిల్ రాచన్నగౌడ్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాచన్నగౌడ్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం గూళ్యపాళ్యం గ్రామంలో నిర్వహించిన శివగణారాధన (పెద్దకర్మ) కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు ఆయన భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, రైతు విభాగం కార్యదర్శి వెంకటరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు సుదీర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కురుబ సంఘం కమిటీ ఏర్పాటు

కణేకల్లు: పట్టణ కురుబ సంఘం నూతన కమిటీ ఆదివారం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడిగా పూజారి లింగమూర్తి, కార్యదర్శిగా తిమ్మరాజు, ప్రచార కార్యదర్శిగా కోరి నాగరాజు, గౌరవాధ్యక్షుడిగా జావేటి ఎన్నికయ్యారు. అలాగే కురుబ సంఘం యూత్ కమిటీ గౌరవాధ్యక్షుడిగా మంజునాథ్, అధ్యక్షుడిగా అఖిల్‌చంద్ర, ఉపాధ్యక్షుడిగా శివ, కార్యదర్శిగా మధు, కోశాధికారిగా మహేష్‌ను ఎన్నుకున్నారు.

తెగుళ్ల బారిన బ్యాడిగి మిర్చి



కూడేరు: బ్యాడిగి మిర్చి పంటకు తెగుళ్లు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కూడేరు, ముద్దలాపురం, బోళసముద్రం,జల్లిపల్లి, కొర్రకోడు, జయపురం, ఇప్పేరు, అంతరగంగ, మరుట్లతో పాటు మరికొన్ని గ్రామాల్లో సుమారు 3 వేల ఎకరాల విస్తీర్ణంలో బ్యాడిగి మిర్చిని రైతులు సాగు చేశారు. ప్రస్తుతం పంటకు తెల్ల దోమ(వైరస్), నల్ల తామర పురుగు, బూడిద తెగుళ్లు ఆశించాయి. తెగుళ్లతో ఆకులు ఎర్రబడి ముడుచుకుపోతున్నాయి. ఇగుర్లు దెబ్బతినడంతో పంట ఎదుగుదల లేకుండా పోతోంది. రైతులు మందులు పిచికారీ చేస్తున్నా తెగుళ్లు తగ్గుముఖం పట్టడం లేదు. దీంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. హార్టికల్చర్ అధికారులు బ్యాడిగి మిర్చి పంటకు సోకిన తెగుళ్లను పరిశీలించి నివారణకు సలహాలు, సూచనలు అందించాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు


మాట్లాడుతున్న ఎంఈఓ ఎర్రిస్వామి

ఉరవకొండ: స్థానిక ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ప్రభుత్వ పాఠశాలల్లో 3 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు నవంబర్ 14 జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ఉరగాద్రి బాలోత్సవం-2023 క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, ఎంఈఓ ఎర్రిస్వామి, నిస్వార్థ ఫౌండేషన్ ప్రతినిధి తాడికొండ వెంకట్ ప్రారంభించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 300 మంది విద్యార్థులు స్కిప్పింగ్, పేపర్ పైన రంగోలి, చెట్లు ఉపయోగాలు, మంచి ఆహార అంశాలపై ప్రెజెంటేషన్, పనికిరాని వస్తువులతో అందమైన బొమ్మల తయారీలాంటి పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు నవంబర్ 14న బహుమతులు ప్రదానం చేస్తామని పౌండేషన్ సభ్యులు తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

గుమ్మఘట్ట: మండలంలోని బేలోడు గ్రామానికి చెందిన భాస్కర్(23) బళ్లారి విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రామాంజనేయులు, భీమక్కకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె . చిన్న కుమారుడైన భాస్కర్‌కు అదే గ్రామానికి చెందిన తిప్పమ్మతో ఆరు నెలల క్రితం వివాహమైంది. వ్యసనాలను మానుకోవాలని భాస్కర్‌ను గత గురువారం తల్లిదండ్రులు మందలించారు. మనస్థాపానికి గురైన అతడు పొలంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి అతడు మరణించడంతో కుటుంబసభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కరపత్రాల విడుదల

ఉరవకొండ: హైదరాబాద్‌లో నవంబర్ 18న నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం స్థానిక హరిజన్ హాస్టల్ ప్రాంగణంలో మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు విడుదల చేశారు. మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ గౌరవ సలహాదారులు ఎర్రిస్వామి, భాస్కర్ బాబు, డేవిడ్, గౌరవాధ్యక్షుడు భాస్కర్, నియోజకవర్గ అధ్యక్షుడు సింగాడి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వచ్చే శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. మహాసభకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మాదిగ ఉద్యోగులు పెద్దఎత్తున హైదరాబాద్‌కు తరలిరావాలన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి అనుమానుషం

రాయదుర్గంటౌన్: పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి ఏపీఎస్ ఆర్టీసీ డిపో డ్రైవర్ బత్తుల రామ్‌సింగ్‌పై నడిరోడ్డుపై కొందరు దుండగులు అమానుషంగా దాడి చేయడం పాశవిక చర్య అని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఉద్యోగులు తీవ్రంగా ఖండించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి రాయదుర్గంలో ఆర్టీసీ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. నిరంతరం ప్రజల మధ్య విధులు నిర్వర్తించే ఆర్టీసీ ఉద్యోగులపై దాడులు చేయడం సమంజసం కాదన్నారు. డ్రైవర్‌పై దాడి చేసిన దుండగులకు కఠిన శిక్ష విధించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీపీటీడీ ఎన్ఎంయూఏ డిపో కార్యదర్శి హెచ్‌టీ స్వామి, గోపాల్, రామచంద్ర, మైలారప్ప, రామాంజనేయులు, శివుడు, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.